APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ బుధవారం 24, జూన్ 2026 సంపుటి: 01 సంచిక :29 పేజీలు : 04 వెల: 2-00/-

## సీఎం చంద్రబాబుని కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం



అనంతపురం, జూన్ 24 అనంత సూర్య : విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని బుధవారం అనంతపురం పట్టణం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అందులో భాగంగా గడ్డం సుబ్రహ్మణ్యం చంద్రబాబు నాయుడు ఇరువురు చాలాసేపు అనంతపురం జిల్లా పరిస్థితుల పైన చర్చించినట్టు తెలుస్తుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుతో గడ్డం సుబ్రహ్మణ్యం జిల్లా పరిస్థితులు, పార్టీ కోసం అనునిత్యం కష్టపడినటువంటి పార్టీ కార్యకర్తల గురించి అనేక విషయాలు సీఎం చంద్రబాబు నాయుడుకి వివరించడం

2వ పేజీలో



## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

- హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నాటి ఐదు కేసుల కొట్టివేత
- ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కేసుల్లో విముక్తి
- చట్టపరంగా ముగిసిన దీర్ఘకాల వివాదం

హైదరాబాద్, జూన్ 24 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. 2019 హుజూర్‌నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచార సమయంలో నమోదైన ఐదు కేసులను తెలంగాణ హైకోర్టు బుధవారం

2లో

## కొత్తచెరువు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతన డీఈఓ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే



అనంత సూర్య.: కొత్తచెరువు, జూన్ 24: శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలోని బాయ్స్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా విద్యాశాఖాధికారి డిఈ ఓ కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సంయుక్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యాలయ భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు

2లో

## పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగవంతం చేయాలి

- కాలపరిమితిలోగా సింగిల్ డెస్క్ పోర్టల్ దరఖాస్తులకు క్లియరెన్స్ ఇవ్వాలి
- జులై 6న రీజనల్ వర్క్‌షాప్ విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

పుట్టపర్తి (జన చైతన్య ప్రతినిధి) : శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి) సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సులో కుదిరిన అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు), ఎస్ఐపీబీ ఒప్పందాల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేసి, ఒప్పందాలు పూర్తి చేసుకున్న పరిశ్రమలు త్వరగా ఉత్పత్తి దశకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ (ఎస్‌డీపీ) ద్వారా వచ్చిన పరిశ్రమల దరఖాస్తులకు ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలోపే అన్ని అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు.



## ప్రజా పదవి బాధ్యత కావాలి, ప్రత్యేక హక్కు కాదు: ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్



2లో

- 'వీఐపీ కల్చర్ ఇన్ ఇండియా' పుస్తకావిష్కరణ
- ప్రతి భారతీయుడూ వీఐపీనే అన్న ప్రధాని వ్యాఖ్యను గుర్తు చేసిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 24 : భారతదేశంలో అధికార, ప్రత్యేక హక్కులు, ప్రజాస్వామ్య విలువలపై చర్చించే "వీఐపీ కల్చర్ ఇన్ ఇండియా: పవర్, ప్రివిలేజ్ అండ్ ది డిస్టెన్స్ ఫ్రం డెమోక్రసీ" పుస్తకాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కరించారు. మాజీ ఎంపీ నబామ్ రెబియా రచించిన ఈ పుస్తకానికి సందీప్ కుమార్ సహ రచయితగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్న "ప్రతి భారతీయుడు ప్రత్యేకమైనవాడే, ప్రతి భారతీయుడూ వీఐపీనే" అనే వ్యాఖ్యను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి సమాన గౌరవం, అవకాశాలు ఉండాలని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా కనిపించే ప్రత్యేక హక్కులు మాత్రమే కాకుండా,



2 లో

## నిర్మాణంలో ఉన్న గోదాం కుప్పకూలి విషాదం..

- శిథిలాల కింద డజన్ల మంది కార్మికులు

కోల్‌కతా, జూన్ 24, 2026 : పశ్చిమ బెంగాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఒక గోదాం కుప్పకూలిపోవడంతో అక్కడ పనిచేస్తున్న డజన్ల మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ఘటన కోల్‌కతాలోని తరతలా ప్రాంతంలో మధ్యాహ్నం సమయంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం, సుమారు 50 మంది కార్మికులు గోదాం నిర్మాణ పనుల్లో

## దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యా నమూనా: నారా లోకేశ్

- కొక్కిలిగడ్డలో నూతన పాఠశాల భవనాల ప్రారంభం
- విద్యా వ్యవస్థలో మార్పులకు ఉపాధ్యాయుల సహకారం కీలకం
- సమష్టి కృషితోనే విద్యారంగంలో ఆశించిన ఫలితాలు


అవనిగడ్డ, జూన్ 24 : కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులతో మమేకమయ్యారు. అనంతరం పాఠశాల భవనాలను పరిశీలించి విద్యా సదుపాయాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్యారంగాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరమని అన్నారు విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ.



2వ పేజీలో

## పాక్ గగనతలంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం..

న్యూఢిల్లీ, జూన్ 24 : ఢిల్లీ నుంచి అమృత్‌సర్ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానం సోమవారం రాత్రి అనుకోకుండా పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించిన ఘటన కలకలం రేపింది.



2వ పేజీలో

## మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం: కల్వకుంట్ల కవిత

- వెటా ఇండియా మహిళా సాధికారత సదస్సులో ప్రసంగం
- సమాజంలో మహిళలకు ఇంకా అనేక అడ్డంకులు
- మహిళల ఎదుగుదలకు కుటుంబం, ప్రభుత్వం, సమాజం తోడ్పడాలి

2 లో

హైదరాబాద్, జూన్ 24 : మహిళల సాధికారత కోసం ప్రభుత్వం, కుటుంబం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన వెటా ఇండియా మహిళా సాధికారత కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలు ఎంత ప్రతిభ కనబరిచినా, ఎంత కష్టపడ్డా సమాజంలో అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉద్యోగాలు, పదోన్నతులు, నాయకత్వ స్థానాల్లో మహిళలకు సమాన అవకాశాలు లభించడం లేదని పేర్కొన్నారు. . సమాజంలో ఉన్న వివక్షను తొలగించేందుకు అందరూ




## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

- గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు
- రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణం
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ భద్రతే లక్ష్యం

2లో

నాగర్‌కర్నూలు, జూన్ 24: నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి, చెన్నపురావుపల్లి



# మహిళల సాధికారతకు సమిష్టి కృషి అవసరం: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తర్వాత)

అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు తమ లక్ష్యాలను నిర్దేశించుకున్న తర్వాత వెనక్కి తగ్గకుండా ముందుకు సాగాలని ఆమె సూచించారు. విజయాన్ని సాధించాలంటే ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎంతో ముఖ్యమని చెప్పారు. మహిళలు ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇతరులకు ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేసిన కవిత, అయినప్పటికీ ఆ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ కావడం లేదని అన్నారు. దీనికి కుటుంబాలు, సమాజం నుంచి తగిన ప్రోత్సాహం లేకపోవడమే కారణమని అభిప్రాయపడ్డారు. రాజకీయాలు, న్యాయరంగం, పరిపాలన సహా అనేక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళలు ప్రతిభ చూపుతున్నప్పటికీ ఉన్నత స్థాయిలకు చేరుకునే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పారు. సమాన అవకాశాలు కల్పించకుండా మహిళా సాధికారత సాధ్యం కాదన్నారు. సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న ఈ కాలంలో యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కవిత సూచించారు. ఆడ-మగ అనే తేడా లేకుండా అందరూ కలిసి పనిచేసినప్పుడే మహిళా సాధికారత నిజంగా సాధ్యమవుతుందని అన్నారు.

# పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తర్వాత)





జిల్లాలో కొత్తగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) స్థాపించే వారికి అవసరమైన వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఏపీ ఎంఎస్ఎంఈ, ఈడీపీ, ఐడీపీ 2024-29, ట్యాగ్ పాలసీల కింద దరఖాస్తు చేసుకున్న పరిశ్రమలకు రాయితీలు సకాలంలో అందించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), పీఎం విశ్వకర్మ పథకాల కింద రుణాల పురోగతిని సమీక్షించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి ఎంఎస్ఎంఈలలో డిజిటల్ సర్వేలు నిర్వహించాలని సూచించారు. జులై 6న నిర్వహించనున్న "ఆత్మనిర్భర్ భారత్ -- రక్షణ, పర్యావరణ పరిశ్రమల ఎకోసిస్టమ్ ప్రమోషన్" అంశంపై జరిగే రీజనల్ వర్క్‌షాప్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జీఎం/డీఐసీ, జెడ్ఎం/ఏపీఐఐసీ, ఏపీపీసీబీ, ఎల్డీఎం, నాబార్డ్ అధికారులు, డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న గోదాం కుప్పకూలి విషాదం..

(మొదటి పేజీ తర్వాత)

నిమగ్నమై ఉన్న సమయంలో అకస్మాత్తుగా నిర్మాణం కూలిపోయింది. దీంతో అక్కడ ఉన్న కార్మికులు పెద్ద సంఖ్యలో శిథిలాల కింద ఇరుక్కుపోయారు. ఈ ఘటనలో ఇప్పటివరకు ఇద్దరు కార్మికులు మృతి చెందినట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు సహాయక చర్యలు ప్రారంభించి శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసే ప్రయత్నం చేశారు. అనంతరం పోలీసులు, విపత్తు స్పందన బృందాలు, రక్షణ దళాలు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. ఇప్పటివరకు ఏడుగురు కార్మికులను సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారిని బయటకు తీసేందుకు గ్యాస్ కట్టర్ల సహాయంతో భారీ బీమ్‌లను కట్ చేస్తూ రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# పాక్ గగనతలంలోకి ప్రవేశించిన ఎయిర్ ఇండియా విమానం

(మొదటి పేజీ తర్వాత)

ఈ ఘటనపై ఎయిర్ ఇండియా దర్యాప్తు ప్రారంభించింది.సమాచారం ప్రకారం, రాత్రి 9.18 గంటలకు ఢిల్లీ నుంచి టేకాఫ్ అయిన ఆ విమానం 10.30 గంటలకు అమృత్‌సర్ చేరుకోవాల్సి ఉండగా, మార్గమధ్యంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విమానం కొద్ది సెకన్ల పాటు పాకిస్థాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించింది.వెంటనే పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ అధికారులు పైలట్‌కు హెచ్చరిక సందేశాలు పంపినట్లు సమాచారం. పరిస్థితిని గమనించిన పైలట్ వెంటనే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అమృత్‌సర్ విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సాంకేతిక లోపం కారణంగా విమానం తిరిగి ఢిల్లీకి మళ్లించబడింది. అనంతరం రెండు గంటల తర్వాత మళ్లీ టేకాఫ్ తీసుకుని రాత్రి 2.20 గంటలకు అమృత్‌సర్‌లో సురక్షితంగా ల్యాండ్ అయింది.విమానాశ్రయ డైరెక్టర్ భూపేందర్ సింగ్ తెలిపిన ప్రకారం, విమానం పాకిస్థాన్ గగనతలంలో చాలా స్వల్ప దూరం మాత్రమే ప్రయాణించిందని, పెద్ద స్థాయిలో ఎలాంటి ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు.ఈ ఘటన రెండు దేశాల మధ్య గగనతల భద్రతా అంశంపై మళ్లీ చర్చకు దారితీసింది.

# సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

(మొదటి పేజీ తర్వాత)

కొట్టివేసింది. ఈ కేసుల నుంచి తనను విముక్తుడిని చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రేవంత్ రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అప్పట్లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఉన్న ఆయనపై ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలు వచ్చాయి. రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించారనే అభియోగాలతో పోలీసులు పలు కేసులు నమోదు చేశారు.తనపై నమోదైన కేసులు చట్టపరంగా నిలబడవని పేర్కొంటూ రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసుల కొట్టివేత కోసం ఆయన ఐదు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న న్యాయస్థానం గత జూన్ 18న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా బుధవారం తీర్పు వెల్లడించిన హైకోర్టు, అన్ని కేసులను కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. కేసులలో కొనసాగుతున్న న్యాయపరమైన ప్రక్రియను రద్దు చేస్తూ రేవంత్ రెడ్డికి ఉపశమనం కల్పించింది. దీంతో చాలా కాలంగా కొనసాగుతున్న ఈ వ్యవహారానికి ముగింపు లభించినట్లైంది.ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ఈ కేసులు రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారాయి. హైకోర్టు తాజా తీర్పుతో ముఖ్యమంత్రిపై ఉన్న న్యాయపరమైన భారం తొలగిపోయిందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల నిబంధనల అమలు, ప్రచార అనుమతులు, ప్రజా సమావేశాల నిర్వహణ వంటి అంశాలపై ఈ తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఈ కేసులకు సంబంధించిన అన్ని న్యాయ ప్రక్రియలు ముగిసినట్లు స్పష్టమైంది.

# దేశానికే ఆదర్శంగా ఏపీ విద్యా నమూనా: నారా లోకేశ్

(మొదటి పేజీతర్వాత)

పురోగతికి కూడా ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వంలో అత్యంత సవాళ్లతో కూడిన విద్యాశాఖ బాధ్యతలను స్వీకరించినట్లు తెలిపారు.విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడం ఒక్క ప్రభుత్వంతో సాధ్యం కాదని, ఉపాధ్యాయుల సహకారం లేకుండా ఎలాంటి సంస్కరణలు విజయవంతం కావని నారా లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, వారి అంకితభావమే రాష్ట్ర విద్యారంగ పురోగతికి బలమని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేసే శక్తి ఉపాధ్యాయులకే ఉందని పేర్కొన్నారు.దేశంలోనే ఆదర్శవంతమైన విద్యా విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలన్నదే తన ధ్యేయమని నారా లోకేశ్ తెలిపారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా పట్టణ ప్రాంతాల విద్యార్థులతో సమాన అవకాశాలు కల్పించేందుకు మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు.కేవలం భవనాల నిర్మాణంతోనే విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదని, బోధనా ప్రమాణాలు పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన బోధనా విధానాలను విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టి విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి పనిచేసినప్పుడే విద్యా సంస్కరణలు ఫలిస్తాయని నారా లోకేశ్ పేర్కొన్నారు.పిల్లల విద్య విషయంలో తల్లిదండ్రులు



కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలు, నైపుణ్యాలను పెంపొందించడంలో కుటుంబం, పాఠశాల రెండింటి పాత్ర కీలకమని అన్నారు.

# సీఎం చంద్రబాబుని కలిసిన గడ్డం సుబ్రహ్మణ్యం

(మొదటి పేజీ తర్వాత)

అనంతపురం జిల్లా నే కాకుండా అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం ఎంతోమంది సెకండ్ గ్రేడ్ నాయకుల నుండి క్రింది స్థాయి జెండా మోసే కార్యకర్త వరకు పార్టీ అభివృద్ధి కోసం, గతంలోని వైయస్సార్సీపి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు, నిబంధనలు పెట్టినా వాటిని లెక్కచేయకుండా అహర్నిశలు కష్టపడి తెలుగుదేశం పార్టీ విజయం కోసం ఎంతో కష్టపడ్డారని, వారందరికీ మన ప్రభుత్వ హయాములో తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, సరైన న్యాయం చేయాలని కోరినట్లు తెలుస్తున్నది. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ కోసం, పార్టీ విజయం కోసం కష్టపడి పని చేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు సరైన గుర్తింపుతోపాటు, ప్రాధాన్యత ఉంటుందని గడ్డం సుబ్రహ్మణ్యం కు హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నది. గడ్డం సుబ్రహ్మణ్యం ఎన్ని పార్టీలు వచ్చినా, ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడిన అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కోసం ఒక సీనియర్ నాయకుడుగా భావించకుండా ఒక సామాన్య కార్యకర్తగా పని చేసినటువంటి వ్యక్తి, ఇప్పుడు చంద్రబాబు నాయుడుని కలవడంతో జీవితంలో ఏదో ఒక కీలక పదవి ఇస్తున్నారేమో అన్న అనుమానాలు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వ్యక్తమవుతున్నాయి.

# కొత్తచెరువు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతన డీఈఓ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే

అనంతరం రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు మాట్లాడుతూ.. జిల్లాలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, పరిపాలనను ప్రజలకు, ఉపాధ్యాయులకు మరింత చేరువ చేసేందుకు ఈ నూతన డీఈఓ కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ కార్యాలయం అందుబాటులోకి రావడం వల్ల విద్యాశాఖకు సంబంధించిన పనులు మరింత వేగంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గారు మాట్లాడుతూ:నియోజకవర్గ కేంద్రంలో విద్యాశాఖకు సంబంధించి కీలకమైన డీఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన సేవలు ఇక్కడి నుండి వేగంగా అందుతాయని తెలిపారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మరియు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నూతన డీఈఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యాలయ ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి (ఇజుూ)క్రిస్టప్ప,తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, కళాశాల అధ్యాపకులు, రెవెన్యూ సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తర్వాత)

గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల గృహ కలను సాకారం చేసేందుకు తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.22,500 కోట్ల వ్యయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించిన ప్రభుత్వం ఇప్పుడు రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్ల చొప్పున మంజూరు చేసి పేద కుటుంబాలకు గృహ భద్రత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. గృహ నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు దశలవారీగా ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తూ పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరడంతో పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా పెట్టుకుని పనిచేస్తోందని తెలిపారు.

# ప్రజా పదవి బాధ్యత కావాలి, ప్రత్యేక హక్కు కాదు: ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

(మొదటి పేజీ తర్వాత)

కొందరికి ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తోందనే భావన కూడా ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. అలాంటి పరిస్థితులు ప్రజలు, సంస్థల మధ్య దూరాన్ని పెంచే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ప్రజా పదవిని ప్రత్యేక హక్కుగా కాకుండా బాధ్యతగా భావించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. ప్రజా సేవే ప్రజాస్వామ్య వ్యవస్థకు మూల సూత్రమని పేర్కొన్నారు.సమాజంలో సమానత్వం, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన వంటి విలువలను పెంపొందించడంలో ఇటువంటి చర్చలు దోహదపడతాయని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత చేరువగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో అరుణాచల్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నబామ్ టుకి, మాజీ ఎంపీ డబ్ల్యూ.ఆర్. ఖార్లుఖీతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పుస్తక రచయితలను ఉపరాష్ట్రపతి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనంత సూర్య తెలుగువార్త

గురువారం 25 జూన్ 2026

# గాదంకి వద్ద రోడ్డు ప్రమాదం

## ముగ్గురు మృతి,8 మందికి గాయాలు

పాకాల,జూన్ 24 అనంత సూర్య న్యూస్:: తిరుపతి జిల్లా పాకాల మండలం గాదంకి గ్రామం సమీపంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో 8 మంది గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి శ్రీకాళహస్తి సమీపంలోని చింపేడు గ్రామానికి వెళ్తున్న ప్లైవుడ్ లారీ గాదంకి వద్దకు చేరుకోగా, అదే సమయంలో యాదమరి మండలం పెరుమల్లపల్లి నుంచి తిరుపతిలో వివాహ కార్యక్రమానికి వెళ్తున్న ఆటో వెనుక నుంచి వచ్చి లారీని ఢీకొట్టింది.లారీ డ్రైవర్ అకస్మాత్తుగా ఎలాంటి హెచ్చరికలు లేకుండా బ్రేక్ వేయడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ఈ ప్రమాదంలో తవణంపల్లి మండలం ఏనుగుంటపల్లికి చెందిన యనమల మాధవి (40), ఆమె కుమార్తె మేఘన (15) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పులకింటి రాజశేఖర్ (25) రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడగా వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై విచారణ కొనసాగుతోంది..



# కుటుంబానికి చేరిన వ్యక్తి

## ఎన్.ఆర్. పేట పోలీసుల మానవత్వం అభినందించిన ఎస్పీ

చిత్తూరు రూరల్,జూన్ 24అనంత సూర్య న్యూస్:: మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యుల చెంతకు సురక్షితంగా చేర్చి ఎన్.ఆర్. పేట పోలీసులు మానవత్వం చాటుకున్నారు.అస్సాం రాష్ట్రం నాగావ్ జిల్లా గాంధీబారి ప్రాంతానికి చెందిన లక్ష్మీ ప్రసాద్ బోర్డోలోయ్ కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తుండగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఈ నెల 15న ఎన్.ఆర్. పేట ప్రాంతంలో దిగిపోయి అక్కడే సంచరిస్తున్నాడు. విషయాన్ని గుర్తించిన పోలీసులు అతనిని సంరక్షణలోకి తీసుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల కోసం ప్రయత్నించి అస్సాంలోని బంధువులను గుర్తించి సమాచారం అందించారు.బుధవారం అతని అన్న ఎన్.ఆర్. పేటకు చేరుకోగా, తగిన ధృవీకరణ అనంతరం లక్ష్మీ ప్రసాద్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుటుంబ సభ్యుడిని క్షేమంగా అప్పగించినందుకు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఎన్.ఆర్. పేట పోలీసుల సేవాభావాన్ని అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు..



# టీడీపీలోనే కొనసాగుతా

## ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు,జూన్ 24అనంత సూర్య న్యూస్:: తాను జీవించి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. వైసీపీలో చేరే ప్రసక్తే లేదని, టీడీపీని వీడే ఆలోచన కూడా లేదని తెలిపారు.తాను ఎప్పుడూ టీడీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయలేదని, వారిపై ఎలాంటి అక్రమ కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు. పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.ప్రస్తుతం తనపై ఉన్న సస్పెన్షన్‌ను పార్టీ అధిష్టానం త్వరలో ఎత్తివేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అవకాశం వచ్చినా రాకపోయినా టీడీపీని వీడనని స్పష్టం చేశారు.తనపై భూ ఆక్రమణలు, అవినీతి ఆరోపణలు లేవని, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎప్పుడూ ప్రోత్సహించలేదని అన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు.



# పెద్దాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం



అనంతపురం, జూన్ 24, అనంతసూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం, శ్రీ విఘ్నేశ్వరాయ నమః శ్రీ సద్గురు సాయినాథ్ మహారాజ్ అన్నప్రసాద సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి, ట్రస్ట్ సభ్యులు ఓబులపతి, నబి రసూల్, రామకృష్ణ, రవికుమార్ వారి సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చే పేదలు ఆకలి తీర్చడానికి అదృష్టం ఉండాలన్నారు. దేవుడు మాకు ఇచ్చిన కొంతలో పేదలకు ఏదో ఒక రూపంలో సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. బాధ్యతగా పేదల ఆకలి తీర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇవాళ దాదాపు 200 మందికి అన్నదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.15 లక్షల దోపిడీ కేసు ఛేదన



## 8 మంది అరెస్ట్ - రూ.3 లక్షల నగదు, నాలుగు వాహనాలు స్వాధీనం

తిరుపతి జిల్లా, జూన్ 24(అనంత సూర్య న్యూస్:): ఎర్రేడు మండలం అంజిమేడు బస్ స్టాప్ సమీపంలోని దీప్ పంజాబీ దాబా వద్ద ఈ నెల 15న జరిగిన రూ.15 లక్షల నగదు దోపిడీ కేసును తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించారు.ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.3 లక్షల నగదు, దోపిడీకి ఉపయోగించిన నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ (పరిపాలన) ఆర్ల శ్రీనివాసులు తెలిపారు.ఫిర్యాదుదారు రవీంద్రరెడ్డి వద్ద ఉన్న నగదును నిందితులు ముందస్తు ప్రణాళికతో కత్తితో బెదిరించి అపహరించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.నీలాద్రి అపార్ట్‌మెంట్స్ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో నిందితులను అరెస్ట్ చేశారు. వీరు కర్ణాటక, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన ముఠాగా గుర్తించారు.అరెస్ట్ చేసిన వారిలో బాలసాల దామోదరం, పాసల వెంకటరమణ, మునియప్ప వెంకటాచలపతి, నారాయణస్వామి, సయ్యద్ రోషన్, ఏ.అంజి, మద్దిపట్ల గుణశేఖర్, నసిన శ్రీనివాసులు ఉన్నారు. ప్రధాన నిందితురాలు పరారీలో ఉండగా ఆమె కోసం గాలింపు కొనసాగుతోంది.కేసు ఛేదనలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రజలు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లే సమయంలో అప్రవత్తంగా ఉండాలని, అనుమానాస్పద విషయాలు గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ లు అందజేయాలి

## టవర్ క్లాక్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆకులు అలములు కట్టుకొని నిరసన



అనంతపురం జూన్ 24 అనంత సూర్య :ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని టవర్ క్లాక్ వద్ద ఆకులు కట్టుకొని విరుద్ధం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, అధ్యక్షులు తరిమెల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల, ప్రభుత్వ విద్య పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో తెరిచి రెండు వారాలు కావస్తున్నా కూడా ఇప్పటివరకు విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిస్థాయిలో అందివలేదన్నారు. యుద్ధం కారణంతో విద్యార్థి మిత్ర కిట్లు ఇవ్వడం లేదని ప్రకటనలో చేస్తున్నారన్నారు. అయితే వాస్తవంగా దాదాపు 870 కోట్ల రూపాయలు 2025 డిసెంబర్ నెలలోనే 2026 27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థి మిత్రులకు కేటాయిస్తున్నామని చెప్పేసిన ముఖ్యమంత్రి, విద్యాశాఖ కమిషనర్ కోన శశిధర్ ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే యుద్ధం ఏర్పడి మార్చిలో అయితే అంతకుముందే సిద్ధం చేయాల్సిన యంత్రాంగం ఎందుకు సిద్ధం చేయలేదన్నారు. కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే ఆ లెక్కలు పరిమితమయ్యాయా.. లేదంటే విద్యార్థి మిత్ర కిట్లను అందించడానికి ఏ పనులు మొదలుపెట్టాలని అన్నారు. పూర్తిగా విద్యాశాఖ మంత్రి, రాష్ట్రములో ఉన్న కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 36 లక్షల మంది విద్యార్థులు విద్యార్థి మిత్ర కిట్లు లేక యూనిఫామ్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు వేసుకోవడానికి యూనిఫాం లేక.. గత సంవత్సరం ఇచ్చిన యూనిఫామ్ చినిగిపోయిన వాటిని కుట్టుకొని మళ్ళీ వేసుకున్నటువంటి దయనీయ పరిస్థితి ఉందన్నారు. యుద్ధం వల్ల ఇంధనం కొత్త ఏర్పడిందని దీనివల్ల పరిశ్రమ నడవడం లేదని అందుకు లేటవుతుందని చెప్తున్నా.. వాస్తవ పరిస్థితులు చూస్తే ప్రభుత్వ హంగు ఆర్భాటాలకు, నాయకుల కాన్వాయ్ కు ఇంధనాన్ని వేస్ట్ చేస్తున్నారన్నారు. అయినా కూడా ఇంధన కొరత పేరుతో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. అనంతపురం లాంటి కరువు జిల్లాలో తల్లిదండ్రులు పిల్లలను చదివించడానికి డబ్బులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో వేస్తున్నారని అన్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని స్పెషల్ డ్రైవ్ లో నిర్వహిస్తున్నారని కానీ వారికి మౌలిక సదుపాయాలు అందించడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. వీటివల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదకర పరిస్థితుల్లో ఏర్పడతాయన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యాశాఖ మంత్రి తన వ్యక్తిగత పార్టీ పనులకు సమయాన్ని కేటాయిస్తున్నారని, విద్యా వ్యవస్థ పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఏది ఏమైనా విద్యాశాఖ పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న నారా లోకేష్ ఇప్పటికైనా మేల్కొని విద్యార్థుల అవసరాలకు సంబంధించి మీరు మొదటలో చెప్పిన విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు సంబంధించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రంలో ఉన్న ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను అందజేయాలని, అవి నాణ్యమైనవిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, సూర్య ప్రకాష్, నవీన్, అరుణ్ రషీద్, జిల్లా కమిటీ సభ్యులు విజయ్, సాయి కృష్ణ,వంశీ, జాక్,రాజేష్, సతీష్, గణేష్, మహేష్, పరమేష్, సాయి, యశ్వంత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన గుళికలతో తక్కువ

## వర్షపాతంలోనూ పంటలు పండించవచ్చు



అనంతపురము,జూన్ 24 ( అనంత సూర్య) : రైతు సాధికార సంస్థ ఉపాధ్యక్షులు టి విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐ ఏ ఎస్ )గారు తక్కువ వర్షపాతంలోనైనా విత్తన గుళికలతో పంటలు పండించవచ్చని రైతు సాధికార సంస్థ గౌరవ ఉపాధ్యక్షులు శ్రీ టి విజయ్ కుమార్ (రిటైర్డ్ ఐ. ఏ. ఎస్) పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నికల్ మరియు ఇన్నోవేషన్ అధికారి శ్రీ లక్ష్మనాయక్ తో కలసి ఈవీసీ సందర్శించారు. మిడుతూరు గ్రామంలో రైతు హరికృష్ణ దేశీయ విత్తనాలైన సూరజ్ పత్తి విత్తన రకంతో సాగుచేశారు. సాగుచేసిన పత్తి పంటలో మొదటి దిగుబడి తీసుకున్న తర్వాత అదే పంట మొక్కలను కత్తిరించారు. అదేపంటను రెండో పంటగా పండిచానని రెండో సారి వచ్చిన దిగుబడి ఒక ఎకరం లో పత్తి 10 క్వింటాలు దిగుబడి వచ్చిందని, క్వింటం రూ.8000 చొప్పున విక్రయించినట్లు అధికారులకు వివరించారు. అనంతరం గడ్డి జాతి లోని 8 రకాల పంటలు పండించిన కంబయ్య అనే రైతు క్షేత్రాన్ని సందర్శించి పశువుల పాల దిగుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. తదనంతరం స్వాతి కుమారి అనే రైతు పండించిన బీటీ, నాన్ బీటీ పత్తి పంటలను సందర్శించి వాటి మధ్య నున్న తేడాను గమనించారు. దేశీ విత్తనం (నాన్ బీటీ) లో ఆకుల వెడల్పు ఉన్నట్లు, మొక్క ఆరోగ్యాంగా ఉందని గమనించారు. రైతు అశోకు కి చెందిన రెండు ఎకరాల పొలం లో విత్తన గుళికలతో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (ప్రావీణా) ను వరుస పద్ధతిలో విత్తారు. అనంతరం వారు రైతులు, సిబ్బంది తో మాట్లాడుతూ గ్రామం లో రైతులందరు విత్తన గుళికలతో ్రావీణా ను వేసుకోవాలని సూచించారు. రైతులు సమూహాలుగా ఏర్పడి కాంపాక్ట్ బ్లాక్ పద్ధతిలో సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు సూరజ్ కుమార్, జెడిఏ సాల్ రెడ్డి, ఏ డి ఏ వెంకట్, రైతులు, రైతు సాధికార సంస్థ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

